మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

### ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి

# అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి

- ఎస్సీ,ఎస్టీ కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలి
- ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారికే కేటాయించాలి
- ఎస్సీ, ఎస్టీల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి
- వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** జిల్లాలో పదవ తరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించి, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించారు. ఎస్సీ, ఎస్టి వర్గాల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఐడిఓసి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పి.అమరేందర్, దేవ సహాయం, జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్,పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై కమిటీ సభ్యులు కొంకటి లక్ష్మినారాయణ, నీలా దేవి, రాంబాబునాయక్, రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, రాష్ట్ర ఎస్సీ,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్య, ఉపాధి, డిఆర్‌డిఏ, జిల్లా పంచాయతీ రాజ్, అటవీ, ప్లానింగ్, సాంఘిక సంక్షేమ, వ్యవసాయ శాఖ, జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, విద్యుత్ శాఖ, 4 మున్సిపల్ కమిషనర్లు, ఎక్సైజ్‌శాఖ, ఆర్డీవోలు, డిఎస్పీలు, ప్రభుత్వ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాల గురించి సమీక్షించారు. ప్రభుత్వ శాఖలో ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న అభివృద్ధి అంశాలపై వారిగా అమలు, పనుల పురోగతిని అధికారులు వివరించారు. ముఖ్య ప్రణాళికఅధికారి పరిధిలో ఎట్టి పరిస్థితుల్లో ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టవద్దని, ఎక్కడైనా నిధులు దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లాలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగం జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని, ఎవరికీ అన్యాయం జరగకూడదని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టి సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని, కులాంతర వివాహాలు, అంబేద్కర్ విద్యా తదితర పథకాలపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డి.వి.యం.సి)వెంటనే ఏర్పాటు చేస్తామని అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం, ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్షతను నిరోధించడానికి, వారి హక్కులను రక్షించడానికి జిల్లాలో పకడ్బందీగా సివిల్ రైట్ డేలను పకడ్బందీగా నిర్వర్తించి, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమాజంలో వివక్షతను తొలగించడానికి మరియు ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సివిల్ రైట్ డే లు దోహదపడతాయని అలాంటి కార్యక్రమాలను జిల్లాలో విరివిగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో విద్యాశాఖను పకడ్బందీగా అమలు చేస్తూ బడుగు బలహీన వర్గాలఅభ్యున్నతికి పాటుపడుతున్న జిల్లా కలెక్టర్‌ను, విద్యాశాఖ అధికారిని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు అభినందించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి కమిషన్ చైర్మన్ సభ్యులు సూచించిన సలహాలు సూచనలను స్వీకరించి వారి అభ్యున్నతికి మరింత సమర్థవంతంగా సంక్షేమ పథకా లను అమలు చేస్తామని కలెక్టర్ వివరించారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో ఎస్సీ,ఎస్టీలకుఅమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు లబ్ధి తదితర అంశాల వారిగా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్సీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, నష్టపరిహారం చెల్లింపులు, రెసిడెన్షియల్ పాఠశాలల వంటి వివరాలు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని పాఠశాలల్లో 10వ తరగతి రాష్ట్రస్థాయిలో 13వ స్థానంలో నిలిచిందని, ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టి కోటా ప్రకారం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో వసతి గృహాల నిర్వహణ, విద్యా, వైద్యం అన్ని విభాగాలకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, ఎస్సీ,ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం సూచనల మేరకు అన్ని చర్యలు, ఎస్సీ,ఎస్టీ కేసుల పరిష్కారం తదితర అంశాలకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వివిధ సమస్యలపై బాధితులసమస్యల పరిష్కారంపై వినతి పత్రాలను తీసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులు

## నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

- ముగిసిన వేసవి సెలవులు
- మోగనున్న బడి గంట



పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు (ఫైల్)

**నర్వ, జూన్ 11 ప్రభాతవార్త:** వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి.దాదాపు 48 రోజుల అనంతరం విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఆటాపాటలు, షికార్లతో గడిపిన విద్యార్థులు ఇక పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే.నిన్నటి వరకు ఆటపాటలతో ఆడుతూ పాడుతూ గడిపిన పిల్లలు మళ్లీ బ్యాగులేసుకుని బడికి బయలుదేరనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులు సెలవుల్లో బడిబాట నిర్వహించారు. ప్రభుత్వం కల్పించే వసతులు,బోధన,గతేడాది వచ్చిన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా బడిబాట చేపట్టారు.ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని బ్యానర్లు,కరపత్రాలద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులు ,విద్యాశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా కలిగే ప్రయోజనాలను తల్లి దండ్రులకు వివరించారు.మధ్యాహ్న భోజనం,ఉచిత పాఠ్య పుస్తకాలు,నోటుపుస్తకాలు,యూనిఫాంతో పాటు నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ప్రచారం చేశారు.

**వేసవి సెలవులు ముగిశాయి:** నేటి నుంచి బడి గంట మోగనుంది.కొత్త విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. మండల వ్యాప్తంగా 27ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలలు 15, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 5, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 6, గురుకుల పాఠశాల 1మొత్తం 27 పాఠశాలల్లో సుమారు 3400 పైగా విద్యార్థులు చదువుతున్నారు.ఈ నెల 6 నుంచి నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా 150 మంది విద్యార్థులను చేర్పించడం జరిగింది.దీంతోపాటు 1వ తరగతిలో చేరేందుకు మరో 250 మంది,6వ తరగతిలో చేరేందుకు 350 మంది, ఇతర తరగతులలో 70 మందితో మొత్తం 600 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరారు.మొత్తం నర్వ మండలం లోని 27 పాఠశాలల్లో సుమారు 4100 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

**అందుబాటులో పుస్తకాలు:** పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి.ఇప్పటికే పాఠ్య పుస్తకాలు,నోట్ పుస్తకాలు,యూనిఫారాలు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలకు చేరాయి.విద్యార్థులకు అందించేందుకు పుస్తకాలు,నోట్ పుస్తకాలతో పాటు ఒక జత యూనిఫామ్ ఇవ్వడానికి పాఠశాలల్లో రెడీగా అందుబాటులో ఉన్నట్లు ఇన్చార్జి మండల విద్యాధికారి బి.రాంరెడ్డి తెలిపారు. ఈసారి కొత్తగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు పుస్తకాలతో పాటు,నోటు పుస్తకాలు కూడా ప్రభుత్వం నుండి సరఫరా చేయడం జరిగింది.మిగతా తరగతులకు కూడా తర్వాత వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశాం:** పాఠశాలలు పునఃప్రారంభానికి అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్చార్జి మండల విద్యాధికారి –మిగతా4లో..

## వృద్ధులు,దివ్యాంగుల అర్జీలను సత్వరం పరిష్కరించాలి

◆ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 11 ప్రభాతవార్త:** వృద్ధులు,దివ్యాంగుల సమస్యలను జాప్యం చేయకుండా సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి నెల మొదటి బుధవారం జరిగే వృద్ధుల, దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన రెండో బుధవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. 32 మంది ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సంబంధింతఅధికారులతో సమస్యలు తప్పక పరిష్కారమవుతాయని కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ సంధర్భంగా ఒక వయో వృద్ధుడు తన కుమారుడు తనను ఇంటి నుండి గెంటేశాడని,తనను ఆదుకోవాలని కోరాడు.ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అర్హులైన దివ్యాంగులకు 5శాతం కేటాయించాలని, డబుల్ బెడ్ రూం ఇళ్ళను కేటాయించాలని, ఆసరా పెన్షన్లను మంజూరు చేయాలని, పట్టణంలో దివ్యాంగులు చిరు వ్యాపారం చేసుకోవడానికి అర్జీ పెట్టుకుంటే మున్సిపల్ అధికారులు స్థలం లేదా షాపులు కేటాయించాలనే తదితర సమస్యల వినతి పత్రాన్ని దివ్యాంగులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఆర్డీవో నవీన్, అర్బన్ తహశీల్దార్ ఘాన్సీరాం, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్ష,కార్యదర్శులు జగపతిరావు, నస్కంటి నాగభూషణం, కోటేశ్వర్ రెడ్డి, అంజయ్య చారి, తదితరులు పాల్గొన్నారు.

## వరదల సమాచారంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** బుధవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వరద నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఎస్పీ యోగేష్ గౌతమ్, అదనపు కలెక్టర్ సంచిత గంగ్వర్‌తో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నదుల ప్రవాహం మొదటి దశ ఎంత ప్రమాద స్థాయి ఎంత పూర్తి వివరాలు అడిగారు. నదీ తీర గ్రామాలలో మక్తల్ 10, మాగనూర్ 4, కృష్ణ 4 గ్రామాలు ఉన్నాయని వాటికి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎన్ని షెల్టర్స్ గుర్తించారని గుర్తించిన షెల్టర్స్ భవనాల రిపోర్ట్సు వెంటనే ఇవ్వాలన్నారు. ఎస్పీడీసీఎల్ విద్యుత్ శాఖ వారి యాక్షన్ ప్లాన్ ఇవ్వాలని ఎస్ ఈనీ ఆదేశించారు. జిపిల దగ్గర వాటర్ ట్యాంకర్స్ జిపి లలో బ్లీచింగ్ పౌడర్ వేయాలని, మిషన్ భగీరథ అధికారులు యాక్షన్ ప్లాన్ ఇవ్వాలని తెలిపారు. ఓల్డ్ ఏజ్ ఉమెన్ అందరి అన్ని వివరాలు ఉంచుకోవాలన్నారు. బోట్స్ ఫిషర్ మాన్ పంప్స్ లైవ్ జాకెట్స్ జెసిబి ట్రాక్టర్స్ఎమర్జెన్సీ లైట్స్ వాకిటాకీ అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ వారు వరదలపై జంతువుల రక్షణ కొరకు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యశాఖ పరిధిలో ఆశా వర్కర్లు సూపర్‌వైజర్లు అందరిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుకు చేయాలన్నారు.ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఎల్లో లెవెల్, ఆరెంజ్ లెవెల్ వరదల సమయంలో అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరదల్లో ఆహారము త్రాగునీరు షెల్టర్ విద్యుత్తు రవాణా వాహనాల సదుపాయం తదితర వాటిని ప్రమాద గ్రామాలైన 18 గ్రామపంచాయతీలలో అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.అధికారులు అందరు హెడ్ క్వార్టర్ లో ఉండాలి అని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్, మక్తల్, కృష్ణ, మాగనూరు తాసిల్దారులు, విద్యుత్తు,మిషన్ భగీరథ, వ్యవసాయ, పశువైద్య, వైద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## 5వ శక్తిపీఠాన్ని అభివృద్ధి చేద్దాం

- తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం
- దేశంలోనే కీర్తి ప్రతిష్టలు ఉండేటట్లు చేద్దాం
- 2028లో జరిగే కృష్ణా పుష్కరాల నాటికి అభివృద్ధే లక్ష్యం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

**మనవపాడు, జూన్ 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠం కలిగిన జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానాన్ని పునః వైభవంతో తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాల్లో సమగ్ర అభివృద్ధి చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అలంపూర్ పట్టణంలోని దేవాలయాల సమీపంలో ఉన్న ప్రసాద్ స్కీమ్ పథకం బిల్డింగ్ లోని జిల్లా కలెక్టర్ సంతోష్ అధ్యక్షతన జోగులాంబ దేవస్థానం అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి, శాఖల వారీగా చర్యాచరణ ప్రణాళికలు,అభివృద్ధి కార్యక్రమాలు, ఖర్చు అంచనాలపై సమగ్రమైన చర్చ జరిపారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ మాట్లాడుతూ, అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం 5వ శక్తిపీఠంగా ప్రత్యేక ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థానం కలిగి ఉందని, ఈ పవిత్ర క్షేత్రాన్ని పునర్వైభవంతో అభివృద్ధి చేయడం అత్యవసరమని భావించి, ప్రభుత్వం ఇందుకోసం సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని ఆమె పేర్కొన్నారు.ఈ అభివృద్ధి ప్రణాళికలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు.ఈ క్రమంలో,ప్రణాళిక అమలుపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ మూడు సమీక్షా సమావేశాలు నిర్వహించి, అవసరమైన చర్యలను ప్రారంభించారని తెలిపారు. అలంపూర్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి సమర్పించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వానికి నిధుల కొరత లేనందున,అభివృద్ధి వేగంగా చేయవచ్చని తెలిపారు.మాస్టర్ ప్లాన్‌లోని పనులకు దాతలు ముందుకు వస్తారని తెలిపారు. ఇతిహాస పరంగా విలువైన ఆలయ నిర్మాణాల పరిరక్షణ, పునరుద్ధరణ కోసం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పూర్తి స్థాయి సహకారం అందించనున్నదని తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని మ్యూజియాన్ని ఆధునీకరించడంలో కూడా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్నదాన సత్రంనువారం లోపల ప్రారంభించాలని ఈఓ కు ఆదేశించారు. 2028లో జరగనున్న కృష్ణానది పుష్కరాల నాటికి పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధికి సంబంధించి అన్ని పనులు సకాలంలో పూర్తయ్యేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని అన్నారు. అమ్మవారితో ప్రతి ఒక్కరికీ ఉన్న భక్తి సంబంధం ఈ ప్రణాళిక విజయానికి మార్గదర్శకమవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.ఆలయ ప్రాముఖ్యతను ప్రతిబింబించే విధంగా,ఇది ఆధ్యాత్మికతతో పాటు చారిత్రకంగా కూడా విస్తృతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ అలంపూర్ శక్తిపీఠంగా గొప్ప ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతమని,ఇక్కడి జోగులాంబ దేవస్థానాన్ని దేశానికే ఆదర్శంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన జోగులాంబ ఆలయానికి పూర్తిస్థాయిలో అభివృద్ధి అవసరమని తెలిపారు.ఈ ప్రణాళికకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే మూడు సమీక్ష సమావేశాలు నిర్వహించారని తెలిపారు. జోగులాంబ ఆలయం జాతీయ రహదారి పరిధిలో ఉండటంతో, గద్వాల నుంచి ఆలం పూర్ వరకు రోడ్‌సైడ్‌లో ఆర్చులు, –మిగతా4లో..

## ప్రతి విద్యార్థి మాథెమాటిక్స్‌పై పట్టు సాధించాలి

- ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యా బోధన చేయాలి
- విద్యార్థుల భవితవ్యం ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుంది
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



గోడ పత్రికను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ,జూన్ 11 ప్రభాతవార్త :** విద్యార్థుల భవితవ్యం ఉపాధ్యుల చేతుల్లో ఉంటుందని, ఉపాధ్యాయులు అంకిత భావంతో పాఠాలు చెప్పి వారి భవితవ్యాన్ని ఉజ్వలం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం నుండి పాల్గొన్నారు పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఐడిఒసి సమావేశ మందిరంలో మండల విద్యా అధికారులు , మ్యాథమటిక్స్ ఉపాధ్యాయులు, క్లస్టర్ హెడ్మాస్టర్లతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విద్యార్థి అయిన మ్యాథమాటిక్ బాగా నేర్చుకుంటే మిగిలిన సబ్జెక్టుల్లో బాగా రాణించి విజయం సాధిస్తాడని, మ్యాథమెటిక్ సబ్జెక్టు ప్రాధాన్యతను వివరించారు. వనపర్తి జిల్లాలో గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణతలు రెండు శాతం మెరుగు పరుచుకొని 89 శాతం శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని కానీ రాష్ట్రవ్యాప్తంగా చూస్తే రెండు స్థానాలు పడిపోయి చివరి నుంచి నాలుగో స్థానంలో వనపర్తి జిల్లా నిలబడిందని తెలిపారు. అంటే ఇతర జిల్లాలు మనకంటే ఎక్కువ కష్టపడి ముందుకు వెళ్తున్నాయి అనే విషయం స్పష్టమవుతుందన్నారు.జిల్లాలో అత్యధికంగా మ్యాథమాటిక్ సబ్జెక్టులోనే ఫెయిల్ అయ్యారని గుర్తుచేసారు. అందుకే ఈసారి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ ప్రణాళిక ప్రకారం జూన్ 16న పదవ తరగతిలో ప్రవేశించి విద్యార్థులకు మ్యాథమెటిక్స్‌లో ఒక పరీక్ష నిర్వహించడం జరుగుతుందని దాని ఆధారంగా మ్యాథమెటిక్స్ లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి జూన్ 23వ తేదీ నుంచి ఆగస్టు 25 వరకు 45 రోజులు ప్రతిరోజు సాయంత్రం ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు.తిరిగి ఆగస్టు నెలలో మరోసారి మ్యాథమెటిక్స్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని దాని ఆధారంగా విద్యార్థుల పురోగతి తెలుస్తుందన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో విద్యకు చిరునామాగా వనపర్తి జిల్లా ఉండిందని, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయని కానీ ప్రస్తుతం విద్యాపరంగా వనపర్తి వెనుకబడిపోతుందని ఇందుకు ప్రధాన కారణం ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించకపోవడమేనని అవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలోపదవ తరగతిలో ముఖ్యంగా మ్యాథ మెటిక్స్ లో ఐదు నుంచి 10 విద్యార్థుల కంటే ఎక్కువ మంది ఫెయిల్ కావడానికి వీలులేదని ఆదేశించారు. మంచి ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను సన్మానం చేస్తామని, మ్యాథమెటిక్స్ లో ఎక్కువమంది ఫెయిల్ అయిన ఉపాధ్యాయుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ అబ్దుల్ గని, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎగ్జామ్స్ గణేష్, ఎంఈఓలు మ్యాథమెటిక్స్ ఫోరం టీచర్లు, క్లస్టర్ హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

## నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు

- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వనపర్తి శాసన సభ్యులు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి హాజరయ్యారు. వనపర్తి నియోజక వర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లకు గాను మొదటి దశలో 770 ఇళ్ళు మంజూరు చేయగా రెండవ దశలో 2730 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి బుధవారం మంజూరు పత్రాల పంపిణీ చేశారు. మొదటి, రెండవ దశలో మంజూరు చేసిన ఇళ్లను కలుపుకొని ఘనపూర్ మండలానికి 402, గోపాల్‌పేట 419, పెబ్బేరు 355,పెబ్బేరు మున్సిపాలిటీకి 143, పెద్దమందడి 376, రేవల్లి 205, ఎదుల 162, శ్రీరంగాపూర్ 266,వనపర్తి మండలానికి 453, వనపర్తి మున్సిపాలిటీకి 575, ముసాపేట 14, అడ్డకుల 60 వెరసి 3430 ఇళ్లను జిల్లా కలెక్టర్ ద్వారా ఆమోదం పొంది మంజూరు పత్రాలు జారీ చేయడం జరిగింది. మరో 70 లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసన సభ్యులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం, పట్టణం లేదని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల చొప్పున 3500 ఇండ్లకు రూ.175 కోట్లు కేవలం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం వెచ్చిస్తున్నామని తెలిపారు. ఈ రోజు రూ.50 కోట్ల విలువగల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పట్టాలు స్వీకరించిన లబ్ధిదారులు 45 రోజులలో ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టాలని సూచించారు. పేదలకు ఇందిరమ్మఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. గత పాలకులు మోసపూరితంగా తెచ్చిన ధరణిని బంగాళాఖాతంలో పడేసి, రైతుల భూ సమస్యలను శాశ్వత పరిష్కారం కోసం భూ భారతి చట్టం అమలు పరుస్తూ, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వనపర్తి నియోజకవర్గంలోఇండ్లు లేని నిరుపేదలందరికీ పారదర్శకంగా ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్, అధికారులను అభినందించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం భారత దేశ చరిత్రలో లేని విధంగా 26 లక్షల మంది రైతులకు 21 వేల కోట్లతో –మిగతా4లో..



ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

## మిడ్డేమీల్ సిబ్బంది పరిశుభ్రత పాటించాలి

**-ఎంఈఓ ఉషారాణి సూచన**



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఉషారాణి

**భూత్పూర్, జూన్ 11, ప్రభాతవార్త :** పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బంధి పరిశుభ్రతను పాటించాలని మండల విద్యాధికారిణి ఉషారాణి మధ్యాహ్న భోజన వంట సిబ్బంధికి సూచించారు. గురువారం నుంచి పాఠశాలలు పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో భూత్పూర్ పట్టణ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సిబ్బంధి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి పాల్గొని తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భోజన సరఫరా సమయంలో సిబ్బంధిచేతుల్ని శుభ్రం చేసకుని, వంటపాత్రల్ని శుభ్రమైన నీటితో కడిగి వడ్డించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్‌ఎం ఆనందమ్మ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం తయారు చేసే సిబ్బంధి చేతుల్ని శుభ్రంగా కడుగుకోవడంతో పాటు చేతులకు గోర్లు పెంచ కుండా చూడాలని, విద్యార్థిని విద్యార్థులకు పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ విద్యా రిసోర్స్ పర్సన్ రవి చంచల మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసే బాధ్యత మధ్యాహ్న భోజన సిబ్బంధిపైన ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు వారానికి మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు రాగి జావా అందించాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ ఠాగూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూన్ 11ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని, రైతులకు మూడుసార్లు ఇవ్వాల్సిన రైతు భరోసా డబ్బులు ఇప్పటి వరకు కేవలం 2 ఎకరాల వరకే అసంపూర్తిగా ఇచ్చి చేతులు దులుపుకుందని చిలుక బాల్‌రెడ్డి అన్నారు. వర్షకాలం సీజన్ ప్రారంభమైనందునరైతులు పొలాలు దున్నుకొని పంటలు వేయడానికి సిద్ధంగా ఉన్నారని, విత్తనాలు ఎరువులు సబ్సిడీపై ప్రభుత్వం ఇచ్చి రైతు భరోసా డబ్బులు విడుదల చేసి ఎన్నికల్లో చెప్పినట్టుగా రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతులని అన్ని విధాల ఆదుకోవాలని బాల్‌రెడ్డి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనే యులు, జిల్లా కమిటీ సభ్యులు ఏపీ.మల్లయ్య, పులిజాల పరుశురాములు, సిపిఎం నాయకులు చెన్నయ్య, జగన్ పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల పంపిణీ

**ఉప్పునుంతల, జూన్ 11 ప్రభాతవార్త :** మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏకరూప దుస్తుల పంపిణీ స్థానిక ఐకెపి కార్యాలయంలో బుధవారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన 33పాఠశాలలకు జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు, జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి వెల్టూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిశంకర్, ఎంఇఓ చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలో 33 పాఠశాలలకు గాను 1728 ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వారితో పాటు డిఆర్డిఏ జిల్లా అధికారి శ్రీనివాస్, ఐకెపి ఎపిఎం తిరుపతయ్య, సిసిలు మల్లేష్, ఎమ్మార్సీ సిబ్బంది తిరుపతి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఏకరూప దుస్తులు కుట్టిన మహిళా సంఘం సభ్యురాలు సునీత, పద్మ మహిళలు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లా జడ్జి డి.రమాకాంత్‌ను కలిసిన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా జడ్జిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్‌ను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్లో ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్‌కు పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురుకొద్దిసేపు భేటీ అయ్యి జిల్లా స్థితిగతులపై చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ అన్నారు. ఈ భేటీ ద్వారా జిల్లా పరిపాలన మరియు న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం సహకారంతో జిల్లా ప్రజలకు మరింత మెరుగైన న్యాయ సేవలు అందించేలా కృషి జరగాలని ఈ సందర్భంగా ఇరువురు అభిప్రాయపడ్డారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట ర్యాలీ

**ఉప్పునుంతల, జూన్ 11 ప్రభాతవార్త:** అంగన్వాడి కేంద్రాలలో పిల్లల నమోదు సంఖ్యను పెంచాలని ఐసిడిఎస్ బల్మూర్ ప్రాజెక్టు సూపర్వైజర్ బిపాషా సూచించారు. బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులచే అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. కొత్తగా అంగన్ వాడికి నమోదైన పిల్లలు , తల్లులకు నూతన విధంగా స్వాగతం పలికారు. 0 టు ప్లేస్ పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రంలో ఉండాలని, 5 సంవత్సరాల వయస్సు పైబడి ఉన్న పిల్లలు ప్రాథమిక పాఠశాలలో ఉండాలని తలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యం ,పోషణ, విద్యా కేంద్రంలోని ఉంటాయని కేంద్రంలో అన్ని వసతులు ఉంటాయని జీరో నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు అంగన్వాడి కేంద్రంలోనే ఉండాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ బిపాషాతోపాటు కార్యకర్తలు అప్పోజు పద్మ, భార్గవి, పద్మ, సరస్వతి, ఆయా లు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యం గురించి అవగాహన కల్పిస్తూ వారికి శ్రీమంతాలు చేశారు.

## రెడ్డి కన్వెన్షన్‌ను సందర్శన

**ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని సన్మానించిన రెడ్డి సేవా సమితి సభ్యులు**

**మహబూబ్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి బుధవారం జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ సందర్శనకు హాజరైన యూనివర్సిటీ భవనములో పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం సేవా సమితి బాలుర వసతిగృహము, కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించవలసినదిగా కోరడంతో ఆయన రెడ్డి సేవాసమితి బాలుర వసతి గృహం, కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించారు. స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు రెడ్డి సేవా సమితి భవనాన్ని పాలమూరు జిల్లాకు కేటాయించిన ఐఐటీ కళాశాల తరగతులుతాత్కాలికంగా నిర్వహించుకొనుటకు అంగీకరించామని అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి వివరించారు. కళాశాల తరగతుల నిర్వహణకు సేవా సమితి భవనము చాలా అనుకూలంగా ఉందని ప్రొ॥ వి.బాలకిష్టారెడ్డి తెలియజేశారు. అలాగే కన్వెన్షన్ సెంటర్‌ను కూడా సందర్శించి శుభకార్యాల కొరకు చాలా అనుకూలంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జి. వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎన్. సురేందర్ రెడ్డి సభ్యులు టి.పరమేశ్వర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.



బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

# సమన్వయంతో పనిచేయాలి

- ● పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలి
- ● పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలి
- ● మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్11 ప్రభాతవార్త:** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరిశ్రమల ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖలతో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల శాఖ, మున్సిపల్, బీసీ, ఎస్సీ కార్పొరేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ భాగస్వామ్యంతో పరిశ్రమల స్థాపనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టరేట్ శాఖ 3 పెండింగ్ దరఖాస్తులు వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. టి ప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ కులాల వారికి ట్రాక్టర్ అండ్ ట్రైలర్ వాహనాలు ఇద్దరికీ, షెడ్యూల్డ్ తెగల వారికి ఒకటి ట్రాక్టర్, ట్రైలర్ 1, కార్, మారుతి డిజైర్ 1 వాహనాలకు, , పెట్టుబడి సబ్సిడీ మంజూరు కు కమిటీ లో ఆమోదం తెలిపారు. గ్రీన్ ఇండస్ట్రియల్ సెజ్, పోలేపల్లి సెజ్ లో స్ట్రీట్ లైట్‌లు పాత వాటి స్థానం లో కొత్తవి, రోడ్డు పాచ్ వర్క్ రిపేర్ జులై లోగా పూర్తి చేయాలని టిజిఐఐసి అధికారులను ఆదేశించారు. కాంపౌండ్ వాల్ పడి పోయిన చోట నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఓపెన్ డ్రైన్ పైప్‌లైన్ వర్క్ టెండర్ పిలిచినట్లు టిజిఐఐసి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పి.ప్రతాప్, ఎల్‌డియం భాస్కర్, టిజిఐఐసి జోనల్ మేనేజర్ కె.నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ గణేష్, డిపిఓ పార్థ సారథి మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ రఘు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

- **ఈ విద్యా సంవత్సరం 230 రోజుల పనిదినాలు**
- **ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలు అమలు చేయాలి**
- **డీఈఓ రమేష్ కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకున్నాం. సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించడమే ధ్యేయమని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్ కుమార్ తెలిపారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజు పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో అడుగుపెట్టేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా, చక్కని వాతావరణం కల్పించేలా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా ఫర్నిచర్, తరగతి గదుల పరిశుభ్రత సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నూతన విద్యా సంవత్సరం 2025-26 విద్యా సంవత్సరంలో విద్యా ప్రమాణాలు మెరుగుదలకు పాఠశాలలప్రారంభం నుంచే చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ స్పష్టం చేశారు. అందులో భాగంగానే గత నెలలోనే జిల్లా వ్యాప్తంగాఉన్న ఉపాధ్యాయులందరికీ 2 విడతలుగా సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణా తరగతులను పూర్తి చేసినట్లు తెలిపారు. పాఠశాలల ప్రారంభం నాటికి బోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, మెలకువలు, సబ్జెక్టుల వారిగా వివరించేందుకు ఉపాధ్యాయులకు 2దశల్లో శిక్షణా తరగతులు చేపట్టామని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు జూన్ 6వ తేదీ నుంచి గ్రామాల్లో బడిబాట ద్వారా ప్రచారం జరిగిందని, ఈ వారమంతా ఉపాధ్యాయులు ఆ పనిలో ఉంటారన్నారు. దీంతోపాటు అంగన్వాడీలో చదివిన పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించే ప్రక్రియ సాగుతోందని, ప్రభుత్వం విద్యార్థులకు అందించే సౌకర్యాలు, విద్యా బోధన గురించి వివరించి, గత ఏడాది కంటే ఎక్కువ మంది చేరేలా కృషి చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఈ ఏడాది విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు మెరుగైన ఫలితాల సాధన కోసం విద్యా సంవత్సరం ఆరంభం నుంచే సబ్జెక్ట్ టీచర్లకు బాధ్యత అప్పగిస్తామని, పాఠ్యాంశాలు బోధించిన వెంటనే అదనపు స్టడీ అవర్స్ నిర్వహించడం, జరిగిన ప్రతి పాఠంపై పరీక్ష పెట్టడం వంటి ప్రణాళికలను అమలు చేసి పదో తరగతిలో కూడా గత ఏడాది కంటే మెరుగ్గా ఫలితాలు ఉండేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని డీఈవో తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరం పదో తరగతి చదివే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు 2026 మార్చిలో జరగనున్నాయని, ప్రతి రోజు 30 నిమిషాలపాటు విద్యార్థుల చేత చదివించేలా ప్రతి పాఠశాల స్థాయిలో అకాడమిక్ క్యాలెండర్ షెడ్యూల్‌ను రూపొందించి, ఆగస్టు మొదటి లేదా రెండో వారంలో పాఠశాల స్థాయిలో ఆటల పోటీలు, ఆగస్టు మూడో వారంలో జోనల్ టోర్నమెంట్స్ నిర్వహించి జిల్లా సెలక్షన్స్ పూర్తి చేయాలని, ప్రతి నెలా మూడో శనివారం తల్లిదండ్రుల సమావేశాలు అమలు చేయాలని, రోజుకు30 నిమిషాలపాటు పాఠ్య పుస్తకాలు, స్టోరీబుక్స్, దినపత్రికలు, మ్యాగ్జిన్లు వంటి వాటిని విద్యార్థుల చేత చదివించాలని డీఈఓ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**- సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు**



ఎంఈఓ శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూన్ 11 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జులై 9న సమ్మె చేపట్టబోతున్నామని ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులు జులై 9న చేపట్టే సమ్మెలో పాల్గొంటారని సూచిస్తూ కల్వకుర్తి, ఊర్కొండ, మండలాలకు సంబం ధించిన ఎంఈఓ శంకర్ నాయక్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఒక బిఎంఎస్ తప్ప అన్ని ట్రేడ్ యూనియన్సు సమ్మెకు పిలిపిచ్చాయని, గత నెల మే 9న చేపట్టిన సమ్మె దేశంలో నెలకొన్న వివిధ కారణాలవల్ల వాయిదా వేసి జులై 9న సమ్మె చేయాలని కార్మిక సంఘాలన్నీ పిలిపిచ్చాయన్నారు. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు స్కీం వర్కర్లు కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్, డైలీ వైస్ అసంఘటిత రంగ కార్మికులు పాల్గొనబోతున్నారని, ప్రధానంగా కార్మి కుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొ చ్చినటువంటి నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, అదేవిధంగా వివిధ రంగాల కేంద్ర స్కీములకుబడ్జెట్ తగ్గిస్తున్నట్టుగానే మధ్యాహ్న భోజన పథకానికి కూడా తగ్గించారని 20 సంవత్సరాలకు పైబడి ఈ స్కీంలో పనిచేస్తున్న కార్మికులు ఎప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తిస్తుందని ఆశతో పని చేస్తున్నారని, కానీ కొన్ని జిల్లాల్లో అక్షయపాత్ర, ఇస్కాన్ లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పాలని ప్రయత్నిస్తుందని వాటిని కార్మిక వర్గం తిప్పి కొడుతుందన్నారు. వారానికి మూడు గుడ్లు పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారు తప్ప గుడ్డుకు కేటాయించిన డబ్బులు రెండు గుడ్లకే సరిపోతాయని, మూడో గుడ్డు పెట్టాలంటే గుడ్డుకు అద నంగా బడ్జెట్ కేటాయించాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేల జీతం ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి బిల్లులు పెండింగ్ లేకుండా నెలనెలా చెల్లించాలని ప్రభుత్వాన్ని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. జులై 9నజరిగే సమ్మెలో పాల్గొనబోతున్నట్టువారు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలోనిర్మల, లక్ష్మి, అన్నపూర్ణ, యాదమ్మ, సువర్ణ, పర్వీన్, నిరంజన్‌బి, గోరబి, సాయమ్మ, కృష్ణవేణి, అలివేల పాల్గొన్నారు.

## రైతులకు మరింత అందుబాటులోకి భూమి రికార్డులు

**● తాడురు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రమీల**



తాడురులో రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రమీల

**ఉప్పునుంతల, జూన్ 11 ప్రభాతవార్త:** భూభారతి చట్టం 2025 అమలులో భాగంగా బుధవారం మండల పరిధిలోని తాడూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రమీల పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలు, భూములకు సంబంధించిన సమస్యలు భూభారతి వైబ్ సైట్ ద్వారా రైతులకు లభించే ప్రయోజనాల గురించి చర్చించారు. భూభారతి వైబ్‌సైట్ రైతులకు ఎలా ఉపయోగపడుతుందో, వారి సమస్యలను ఎలా పరిష్కరిస్తుందో తహసీల్దార్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఈ సదస్సుల ద్వారా రైతులకు వారి భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి, భూభారతి వెబ్ సైట్ గురించి మరింత అవగాహన కల్పించారు. తాడూరులో వివిధ సమస్యలపై 49 మంది రైతులు అర్జీలు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీలతో పాటు సీనియర్ అసిస్టెంట్ బాల్‌రాంనాయక్, సిబ్బంది శంకర్, శివ, సాయి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

**మొల్గరలో:** రైతు అభ్యున్నతి కోసమే భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భాగంగా బుధవారం మండల పరిధిలోని మొల్గర గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు శాశ్వత పరిష్కరించాలని భూభారతి నూతన చట్టాలను ప్రతిష్టాత్మక ప్రభుత్వం ప్రవేశపెట్టి రైతు అభ్యున్నతి కోసం రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారని అన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టంలో భాగంగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో తమ పరిధిలో లేని భూ సమస్యలకు కొత్తగా రూపొందించిన భూభారతి చట్టంలో అనేక మార్గాలు ఉన్నాయని వివరించారు. రైతులు వివిధ సమస్యలపై 31 మంది అర్జీలు పెట్టుకున్నారు. ఈ సదస్సులో ఉప తహసీల్దార్ పరుష్ నాయక్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజాత, సిబ్బంది ఆదిత్య, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**నేడు మండలంలో:** భూభారతి చట్టం 2025 అమలుపై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భాగంగా నేడు గురువారం మండలంలోని పెద్దాపూర్, తిప్పాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రమీల తెలిపారు. ఈ సదస్సులకు రైతులు సకాలంలో హాజరై తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలని ఆమె సూచించారు.

## రైతులకు వెంటనే రైతు భరోసా విడుదల చేయాలి



ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**ఉప్పునుంతల, జూన్ 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు రైతు భరోసా, అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని ఖరీఫ్ సీజన్ రావడంతో అందుబాటులో ఎరువులు , విత్తనాలు ఉంచాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదని, రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ సిబ్బందికి అందజేశారు. ఆందోళన చేపట్టిన వారిలో మండల సిపిఎం కార్యదర్శి చింతల నాగరాజు, మండల కమిటీ సభ్యులు కంచ హుస్సేన్, కేసు మల్ల సైదులు, రైతులు పాల్గొన్నారు.

## పాతమొల్గరలో అంగన్వాడీ బడిబాట

**భూత్పూర్, జూన్ 11, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలంలోని పాతమొల్గరగ్రామంలో బుధవారం అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు మూడేళ్లు నిండిన బాలలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని నిర్వహించాలని బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు పలకలు, నోటు పుస్తకాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. వీరికి పౌష్టికారంతో కూడిన గుడ్డు బిర్యాని భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, భూత్పూర్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మందడి నర్సింహ్మారెడ్డితో పాటు ఎంపీడీఓ ప్రభాకర్‌చారి, డిప్యూటీ తహశిల్దార్ గీత, ఆర్ఐ బాలసుబ్రమణ్యంతో పాటు ఇతర అంగన్వాడీ కార్యకర్తలు, టీచర్లు పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం

**భూత్పూర్, జూన్ 11, ప్రభాతవార్త:** ఇటీవల ఎస్సెస్సీ బోర్డ్ ప్రకటించిన ఫలితాల్లో తప్పిన కారణంగా మనస్థాపానికి గురైన భూత్పూర్‌మండలం వెల్కిచర్లకు చెందిన గోసుల కుర్మయ్య (17)ఈ నెల 8వ తేది నంచి ఇంటి వెళ్లి మూడ్రోజులైన ఇంత వరకు ఇంటికి చేరుకోలేదని విద్యార్థి తల్లి గోసుల నర్సమ్మ బుధవారం భూత్పూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. అదృశ్యమైన విద్యార్థి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## మెను తప్పకుండా పాటించాలి

**మానవపాడు, జూన్ 11 ప్రభాతవార్త:** విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం పథకంలో ప్రతిరోజు క్రమం తప్పకుండా మెనూ పాటించాలని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శాంతిరాజ్, ఎంఈఓలు శివప్రసాద్, రామక్రిష్ణ అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం పథకంపై ఇరు మండలాల ఉపాధ్యాయులకు సమావేశ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో వంటకు సంబంధించి తాజాగా ఉన్నటువంటి కూరగాయలను పోషక విలువలతో వాటిని మాత్రమే వాడాలని సూచించారు. శుభ్రమైన నీటిని మాత్రమే వంటకు ఉపయోగించాలని సూచించారు. వర్షాకాల సీజన్ మొదలవడంతో త్రాగునీటిని వంట చేసే పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. ఎప్పటికప్పుడు అన్నిటినీ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా ఉండాలన్నారు. వంట చేసే సిబ్బంది డ్రెస్ మెయింటైన్ చేయాలని పరిశుభ్రతపాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు విష్ణు అనిత దేవి, మద్దిలేటి రెండు మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులు, సిఆర్పిఎస్ , వంట చేసే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న రాజ్ కుమార్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, జూన్11 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం బాపునగర్‌లోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరిదేవి దేవాలయంలో అమ్మవారిని బుధవారం రోజు భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ డా. కె.రాజ్ కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. అలాగే ఫౌండేషన్ సభ్యులతో కలిసి అన్నదానం కార్యక్రమం చేశారు. ఆలయ కమిటి రాజ్ కుమార్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. ఆయన వెంబడి అభిమానులు స్థానికులు భక్తులు ఫౌండేషన్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దాపూర్‌లో బడిబాట కార్యక్రమం

**ఉప్పునుంతల, జూన్11 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో బుధవారం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తమ పిల్లలను సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులతో పాటు ఉచిత నిర్బంధ విద్య, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నామని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. బడి ఈడు కలిగిన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పీఎం శ్రీ ఉప్పునుంతల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్యాంసుందర్ గౌడ్, అజ్మతుల్లా, రాజా వర్ధన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పౌష్టికాహార మధ్యాహ్న భోజనంపై శిక్షణ

**దేవరకద్ర, జూన్ 11 ప్రభాతవార్త :** పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంపై భూత్పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే సిబ్బందికి, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆనందమ్మ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనం వండే సిబ్బంది పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గోర్లు పెంచుకోకుండా, చేతులు శుభ్రంగా కడుక్కుని, సరైన వంటపాత్రలతో వంట వండి వడ్డించాలని ఆమె కోరారు. పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత వంట సిబ్బందిపైనే ఉందని ఆనందమ్మ స్పష్టం చేశారు. ఎంఈఓ ఉషారాణి మాట్లాడుతూ, కూరగాయలను శుభ్రంగా కడిగి వండాలని, వడ్డించేటప్పుడు కూడా పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ విద్యా రిసోర్స్ పర్సన్ రవికుమార్ చంచల పాల్గొని, వంట సిబ్బందికి, ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. వారానికి మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు రాగి జావా అందించాలని, పౌష్టికాహార బాధ్యత మధ్యాహ్న భోజన సిబ్బందిపైనే ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ప్రధానోపాధ్యాయులు కూడా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. మధ్యాహ్న భోజన మెనూ, పాటించవలసిన జాగ్రత్తలు, సూచనలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కిచిడి, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, ఆకుకూరలు, బిర్యానీ ఎలా వండాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పి ఠాగూర్, భూత్పూర్ కాంప్లెక్స్ పరిధిలోని మధ్యాహ్న భోజనం వండే సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ తప్పనిసరి

**జిల్లా రవాణా శాఖ అధికారి మానస**

**వనపర్తి, జూన్ 11 ప్రభాతవార్త :** అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తప్పనిసరిగా ఉండాలని డిటిఓ మానస స్కూల్ యజమానులను హెచ్చరించారు. ఈనెల 12న అన్ని పాఠశాలలు పున ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ ఉండాలని ఆమె తెలిపారు. ఇన్సూరెన్స్ పొల్యూషన్ లేని బస్సులు రోడ్డుపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అంతేకాకుండా బస్సును సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. తనిఖీలలో భాగంగా ప్రవేట్ పాఠశాలల బస్సులను ఆమె గురువారం తనిఖీ చేశారు.

## కన్నుల పండుగగా శ్రీతిమ్మప్ప స్వామి కళ్యాణం

**మల్దకల్, జూన్ 11, ప్రభాతవార్త;** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు ఆదిశీలా వాసుదు మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపుగా విగ్రహాలను కళ్యాణ మండపం లో ఉంచి కళ్యాణాన్ని వేదమంత్రాలతో అనేకమంది భక్తుల మధ్య నిర్వహించారు. ఈ పౌర్ణమికి ముగ్గురు భక్తులు గద్వాల అక్కల రమాదేవి కుటుంబ సభ్యులు, సింగిల్ విండో చైర్మన్ శేషంపల్లి తిమ్మారెడ్డి, తిమ్మాపూర్ వాస్తవ్యులు బలిజ నాగరాజు స్వామివారి కళ్యాణం జరిపించారు. అనంతరం దేవాలయం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాజీ కౌన్సిలర్ భీమ్సేన్ రావు, చంద్రశేఖర రావు, రమేష్ ఆచారి, మధుసూదనాచారి రవి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎద్దుల పరుగు నిర్వహించి తోరణం తెంచే కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలతో రథోత్సవాన్ని నిర్వహించారు.

## అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**అమరచింత జూన్ 11,ప్రభాతవార్త:** దేశంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని టి యు సి ఐ రాష్ట్ర కార్యదర్శి, కె. సూర్యం అన్నారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఏర్పాటు చేసిన టి యు సి ఐ జిల్లా ప్రథమ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన పాలక ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం చట్టాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం రద్దు చేయడానికి కుట్ర పన్నుతుందని ఆయన అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి కార్మికులచే 12 గంటల పని దినాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకోవడానికి ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడు చట్టాలను అమలు చేసి పూర్తిగా కార్మికుల హక్కుల చట్టాలను రద్దు చేయడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా ఉద్యోగ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్మికులకు అండగా టి యు సి ఐ కార్మిక సంఘం ఉంటుందని ఆయన అన్నారు. పట్టణంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, సిపిఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి, హనుమంతు, టియుసిఐ జిల్లా కోశాధికారి, సిరాజు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి, కె.రాజన్న,టియుసిఐ జిల్లా కార్యదర్శి, ప్రసాద్, సామెల్ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి కళ్యాణం

**అమరచింత జూన్ 11, ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని బీసీ కాలనీ శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాన వారిచే అన్నమయ్య సంకీర్తనలతో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి పట్టణంలోని మహిళలు, ప్రజలు భారీగా హాజంయ్యారు. అనంతరం కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## రైతు భరోసా డబ్బును వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలి

**వీపనగండ్ల. జూన్ 11 ప్రభాతవార్త:** రైతు భరోసా డబ్బును వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని సిపిఎం పార్టీ వీపనగండ్ల మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండల కేంద్రంలోని నరసింహ భవన్ లో బుధవారం నాడు సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం మండ్ల కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి డి.బాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో ఎంఎస్పి రేట్లు ప్రకటించడం జరిగింది. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పరిగణంలో తీసుకోకుండా ఎమ్మెస్పి రేట్లను ప్రకటించడంతో రైతులు నష్టపోవడం జరుగుతుందన్నారు. తక్షణమే స్వామినాథన్ కమిషన్ సిఫారసులనుఅమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం ప్రారంభమైనందున తక్షణమే పంటలు పెట్టుబడికై రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయాలని అన్నారు. ఇప్పటికీ రుణమాఫీ కానీ రైతులు చాలా మంది ఉన్నారని, వారికి వెంటనే రుణమాఫీ చేసి తక్షణమే కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సింగోటం గోపాల్ దీన్నే లింక్ కెనాల్ ను వెంటనే పూర్తి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, చేయని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మండ్ల కృష్ణయ్య, మహబూబ్ పాషా,మండల నాయకులు రవిప్రసాద్,ఖాజా హుస్సేన్,వి కృష్ణయ్య,బాలగౌడ్, నిరంజన్ నాగరాజు,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు

**వీపనగండ్ల,జూన్ 11, ప్రభాతవార్త;** రైతుల భూ సమస్యలపై భూభారతి భూమి హక్కుల రికార్డు పై రెవెన్యూ సదస్సులు గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ రెవెన్యూ సదస్సులో వారి యొక్క సమస్యలను దరఖాస్తు రూపం గా ఇవ్వాలని తహసిల్దార్ వరలక్ష్మి రైతులను కోరారు. బుధవారం నాడు వల్లభాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో భాగంగా తాసిల్దార్ వరలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ కృష్ణమూర్తి ఆర్ఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో భూమి సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ రికార్డులో పేర్లు లేనటువంటి వారు కానీ పాస్బుక్కులు రానటువంటి వారు కానీ ఏమైనా భూ సమస్యలు పెండింగ్లో ఉన్నవారు ఇతరత్రా వివిధ రకాల సమస్యలపై రెవెన్యూ సంస్థలో చెప్పాలని ఆమె కోరారు. ఈ సదస్సులో వివిధ రకాల సమస్యలు ద్వారా రైతులు 21 దరఖాస్తులను వల్లభాపురం గ్రామంలో పెట్టుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. ఇంకా నేటి నుండి జరిగే రెవెన్యూ సదస్సులు జరిగే గ్రామాలు గోవర్ధనగిరి 12వ తేదీన గోపాలదిన్నె,13న పుల్గర్ జర్ల, 16న కల్వరాల్ల, 17 18 వీపన గండ్ల ,19 20 తేదీలలో సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఎలాంటి భూ సమస్యలు ఉన్న రైతులు ఈ రెవెన్యూ సదస్సులలో వారి సమస్యలు దరఖాస్తు ద్వారా తమకు అందజేయాలని ఈ సరస్సుల అనంతరం వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ సదస్సులో వీపనగండ్ల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు రావుల నారాయణరెడ్డి .మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి. గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి : మున్సిపల్ కమిషనర్

**ఆత్మకూర్ జూన్ 11, ప్రభాతవార్త ;** ఆత్మకూరు పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు రానున్న వర్షాకాల సీజన్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్ విజ్ఞప్తి చేశారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు పట్టణంలోని పదవ వార్డులో సంబంధిత అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో దోమలు మరియు క్రిమి కీటకాల వలన అంటు రోగాలు ప్రబలి అవకాశమున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి పురపాలక సంఘ అధికారులు చేపట్టే ప్రతి చర్యకు తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో గల మురికి కాలువలు శుభ్రం చేయుట నిలువ నీటిని ఉండకుండా పారద్రోలు ఏ విధంగా పాలకవర్గం చేపడుతున్న చర్యలకు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు. పురపాలక సిబ్బందితో పాటుగా సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

**ఖిల్లాగణపురం, జూన్11, ప్రభాతవార్త;** గ్రామాలలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని, తహసిల్దార్ సుగుణ అన్నారు. బుధవారం ఉప్పరపల్లి, సురాయపల్లి గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తులను పరిశీలించారు. భూములకు సంబంధించి ఏ సమస్య ఉన్న రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలని పాసుబుక్కుల్లో పేరు తప్పుగా నమోదైన భూమి తక్కువగా ఎక్కువగా ఉన్నసరి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. అన్ని రకాల భూ సమస్యలకు రెవెన్యూ సదస్సులే ఆధారమని వీటిని రైతులు ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు ఉప్పరపల్లి, సురాయిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## షేక్ పల్లెలో బోనమెత్తిన మహిళలు

**ఇటిక్యాల, జూన్ 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని షేక్ పల్లి గ్రామంలో బుధవారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని మహిళలు బోనం ఎత్తుకొని సంబరంగా సుంకులమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి బాగా పంటలు పండి రైతులు సంతోషంగా ఉండాలని సుంకులమ్మ అమ్మవారిని వేడుకున్నట్లు మహిళలు గ్రామ ప్రజలు తెలిపారు. ఈ ఉత్సవాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, భీమేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళల ఆధ్వర్యంలో ఘనంగా ఏరువాక పౌర్ణమిని సంబరంగా చేసుకున్నారు.

## పాలెంలో అమ్మ మాట అంగన్వాడీ బాట

**బిజినపల్లి,జూన్ 11 ప్రభాతవార్త :** పాలెం గ్రామంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు బుధవారం అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు ఎనిమిది సంవత్సరాల లోపు పిల్లల్లో ఎక్కువగా సమగ్రాభివృద్ధి ఉంటుందని, కావున ప్రాథమిక పాఠశాలకు ముందు పూర్వ ప్రాథమిక విద్యను చిన్నారులకు అందించాలన్నారు. చదువు, ఆరోగ్యంతో పాటు పిల్లల మానసిక ఉల్లాసానికి ఆటలు బోధనలోనూ కొత్త పద్ధతులతో చిన్నారులకు నేర్పనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రజియా బేగం, విజయలక్ష్మి, ప్రభావతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

◆ ఓబీసీల గురించి మాట్లాడింది కాంగ్రెస్ పార్టీయే : టీపీసీసీ నూతన ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్

◆ నాకు ఇది పదవి కాదు బాధ్యత: టిపిసిసి ప్రధాన రాష్ట్ర కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి



మాట్లాడుతున్న సంజీవ్ ముదిరాజ్, చిత్రంలో మిథున్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 11 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరోసారి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం ఇచ్చినందుకు గర్వంగా భావిస్తున్నట్లు నూతన ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మరో ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాకు పదవి ఇచ్చినందుకు ఏఐసీసీ, టీపీసీసీ అగ్రనాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఓబీసీల సంక్షేమం గురించి మాట్లాడిదే కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ అని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఓబీసీల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కులగణన చేస్తామని షెడ్యూల్ విడుదల చేశారని, కాని 2026లో నార్త్ రాష్ట్రాలు, 2027 మన ప్రాంతంలో చేస్తామనడం సరికాదన్నారు. ఈడబ్ల్యూఎస్ బిల్లును ఏ విధంగా పార్లమెంట్, రాజ్యసభలో పెట్టి త్వరిగతిన అమలుచేశారో, కులగణనను ఆదే విధంగా చేయాలని డిమాండ్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మీరు డీసీసీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారా అని ప్రశ్నకు నేను డీసీసీ అధ్యక్ష రేసులో ఉన్నానని సమాధానమిచ్చారు. మరో టీపీసీసీ నూతన ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఇది తనకు పదవి అని కాకుండా పార్టీ నాపై బాధ్యతగా రాష్ట్రం అంతటా తిరిగి పార్టీని బలోపేతం కోసం కృషి చేస్తానని. అన్నారు. ఈ పదవి అప్పగించినందుకు ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతామని అన్నారు.అనంతరం వారిని, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం చేశారు. సమావేశంలో నాయకులు సిరాజ్ ఖాద్రీ, సిజే బెనహర్ జహీర్ అఖ్తర్, షబ్బీర్ అహ్మద్, సుభాష్ ఖత్రి, అజ్మత్ అలీ, సాయిబాబా, రాములు యాదవ్, ఫయాజ్, మక్సుద్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పాఠశాలలు పున: ప్రారంభం

◆ వంట కార్మికులది గౌరవ కర్తవ్యం ◆ పీఎం పోషన్ శిక్షణ కార్యక్రమంలో సిఎంఓ బాలు బైకాని



మాట్లాడుతున్న బాలు బైకాని

**మహబూబ్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకంలో వంట కార్మికులది ఎంతో గౌరవప్రదమైన బాధ్యతా యుతమైన పాత్ర అని సిఎంఓ బాలు యాదవ్ బైకాని అన్నారు. బుధవారం తాటికొండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజన పథకం) పరిధిలో, కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల నుండి ఒక్కో ఉపాధ్యాయుడు, వంట కార్మికుల కోసం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష సియంవో డా. బాలు యాదవ్ బైకాని అధ్యక్షత ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది విద్యార్థులకు ఇది ఒక్కటే పౌష్టిక భోజనం కావచ్చు. అందువల్ల ప్రతి వంటకార్మికుడు తమ పని చిన్నదిగా కాకుండా, విద్యార్థుల అభ్యాసనాన్ని ప్రభావితం చేసే గౌరవవంతమైన కర్తవ్యంగా భావించాలని కోరారు. అలాగే, తాజా కూరగాయల వాడకం, వ్యక్తిగత పరిశుభ్రత, శుభ్రమైన వంటగదులు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో, ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణంలో బడులు ప్రారంభించాలని, విద్యార్థులందరినీ ప్రాథమిక భాషా, గణిత నైపుణ్యాలపై దృష్టి పెట్టేలా చేయాలని డా. బాలుయాదవ్ సూచించారు. విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం వంటి విషయాల్లో ప్రాథమిక భావనలను బలపరిచేలా సంసిద్ధతా కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.రేపు నిర్వహించనున్న మెగాపేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ఘనంగా నిర్వహించాలని, అందులో తల్లిదండ్రులకు పాఠశాల ప్రణాళికలు వివరించాలని కోరారు. విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు అందించాలనిస్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయురాలు పద్మజ, కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట కార్మికులు పాల్గొన్నారు.

## టిజిపీఈ సెట్ నిర్వహణ పియూకు గర్వకారణం

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ॥ వి బాలకిష్టారెడ్డి

పాల్గొన్న పియు విసి శ్రీనివాస్, రిజిస్ట్రార్, మాజీ వీసీ రాథోడ్

ఉత్సాహంగా ప్రారంభమైన టీజీపీఈ సెట్ ఈవెంట్స్



ఈవెంట్స్‌ను ప్రారంభిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలాకిష్ట రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 11 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా డీపెడ్, బిపెడ్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించనున్న టీజీపీఈ సెట్ 2025 పరీక్షలకు పాలమూరు విశ్వవిద్యాలయంలో మూడు రోజులపాటు జరిగే ఈవెంట్స్ ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈవెంట్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి లక్ష్యంఅఫరెడబిలిటీ, యాక్సిసబిలిటీ, క్వాలిటీఅని, టిజీపీఈ సెట్ నిర్వహించడం పాలమూరు యూనివర్సిటీకి గర్వకారణం అని, వివిధలో ఎంపికలు పారదర్శకంగా ఉండాలని, భారతదేశంలో యువత అధిక భాగంలో ఉన్నారని యువత సక్రమార్గంలో ఉంటే దేశ భవిష్యత్తు బాగుంటుందని, త్వరలో ఉపాధి ఆధారిత కోర్సులు ప్రవేశపెడుతు న్నామని.. అందరికీ శుభాకాంక్షలు అని అన్నారు. పాలమూరు యూనివర్సిటీ లో మొట్టమొదటి సరిగా రాష్ట్రస్థాయి ఎంట్రన్స్ టీజీ పీ ఈ సెట్ నిర్వహిస్తున్నామని, అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, ఉన్నత విద్యామండలి చైర్మన్ సహకారం మరువలేనిదని మాజీ ఉపకులపతి లక్ష్మికాంత్‌రాథోడ్ అన్నారు. ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడా రంగంలో యూనివర్సిటీని అభివృద్ధి చేశారని, టీచింగ్, నాన్ టీచింగ్ తరపున ధన్యవాదములు తెలిపారు. అనంతరం రన్నింగ్ క్రికెట్ పోటీలను వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూసరమేష్‌బాబు,మాజీ వీసీలక్ష్మికాంత్ రాథోడ్‌తో కలిసిఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ప్రారంభించారు. **ఉత్సాహంగా ఈవెంట్స్:** మొదటిరోజు బుధవారం బిపెడ్‌లో 515 మంది విద్యార్థులకు గాను 368 మంది విద్యార్థులు హాజరయ్యారని, 147 మంది గైర్హాజరయ్యారని, అదేవిధంగా డీపెడ్ కోర్స్ లో 217 మంది విద్యార్థులకు గాను 149 మంది విద్యార్థులు హాజరయ్యారని,68 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్ తెలిపారు.

## విద్యా పరిశోధన నిరంతర ప్రక్రియ

◆ నూతన పద్ధతులపై ఆవిష్కరణలు జరగాలి ◆ రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాల కిష్టారెడ్డి




మాట్లాడుతున్న బాలకిష్టా రెడ్డి

**మహబూబ్‌గర్ బ్యూరో, జూన్11 ప్రభాతవార్త:** విద్యావ్యవస్థలో పరిశోధనలు నిరంతర ప్రక్రియ అని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ॥ వి బాలకిష్టారెడ్డి అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో రిసర్చ్ మెథడ్స్‌పై జరిగే రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఈడీలో 2023 విద్యాసంవత్సరం నుండి మారిన సిలబస్ పై విద్యా కళాశాలల అధ్యాపకులకు పాలమూరు విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతోవర్క్‌షాప్ నిర్వహించారు. నూతన బోధనా పద్ధతులపై ఆవిష్కరణలు జరగాలని విద్యాసంస్థలలో పరిశోధనా సంస్కృతిని పెంపొందించాలని నాణ్యమైన ఉపాధ్యాయ విద్య కోసం అందరూ పాటుపడాలన్నారు. వివిధ విద్యా సందర్భాలకు తగిన పరిశోధన పద్ధతులను ఎన్నుకో వాలన్నారు. విద్యార్థిఉపాధ్యాయులను సమర్థవంతంగా మరియు నైతికంగా మార్గ నిర్దేశం చేయడంలో సామర్థ్యాన్ని పెంపొందిం చాలన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా పరిశోధన కార్యక్రమాలు ఉపాధ్యాయ విద్యను, విద్యా ప్రమాణాలను గణనీయంగా పెంచుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విద్య వర్క్ షాప్ ద్వారా అధ్యాపకులు పరిశో ధన రూపకల్పన, గణాంక సాధనాలు, డేటా విశ్లేషణ మరియు విద్యారచన మొదలగు అంశాలపై విస్తృత అవగాహన పెంపొం దించుకొని విద్యా పరిశోధన ద్వారా విద్యాసంస్థలలో బోధనాపరమైన నాణ్యతను పెంపొందించాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొ॥ పి.రమేష్ బాబు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పరిశోధనలను చేయడానికి విద్యాసంస్థలలోతోడ్పాటును అందిస్తుందన్నారు. పరిశోధనలో నిజాయితీ ఉండాలని ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని, ప్రస్తుతం టెక్నాలజీ పెరిగిన ందున ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఉపయోగించుకొని పరిశోధనలో నాణ్యత పెంచుకోవచ్చునికళాశాల విద్యార్థులనుపరిశోధన వైపుమళ్లించాల్సిన బాధ్యత ఉపాధ్యాయ విద్య కళాశాల అధ్యాపకులపై ఉందన్నారు.విద్యా కళాశాల ప్రిన్సిపల్ యూనివర్సిటీలో బీఈడీ కోర్సు ప్రారంభించాలని విద్యార్థి సంఘాల నాయకుల కోరారు. కార్యక్రమంలో ఐక్యుఏసి డైరెక్టర్, మధుసూదన్ రెడ్డి, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెకర్ చంద్రకిరణ్, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డి, హెచ్‌ఓడి ఆంజనేయులు, ఐక్యుఏసి మెంబర్ బషీర్ అహ్మద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత న్యాయ సేవలు




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజని

**శ్రీరంగాపూర్, జూన్ 11 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో బుధవారం రోజు మహిళల సూచిత న్యాయ సేవలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలో మహిళా మండల సమైక్య సభ్యులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గృహహింస నిరోధక చట్టం 2005 ప్రకారం మహిళలను గృహహింసకు గురి చేస్తే శిక్షలు అమలు అవుతాయని తెలియజేశారు. అదేవిధంగా గృహహింసకు గురైన మహిళలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తామని తెలియజేశారు. సీనియర్ సిటిజన్ యాక్ట్ గురించి వివరిస్తూ తల్లిదండ్రులను నిరాశ్రయులను చేస్తే సంతానం కు ఇచ్చిన ఆస్తిని మళ్లీ తల్లిదండ్రులకు అప్పగించే వెసులుబాటు ఉంటుందని తెలియజేశారు. నిరాశ్రయులుగా మారిన వృద్ధులకు సలహాలను సూచనలను ఇచ్చారు. చట్టాలను వివరించడంలో భాగంగా బాల్య వివాహాల చట్టం, బాల కార్మికుల చట్టం గురించి తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీదేవి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు మండల అధ్యక్షురాలు మల్లీశ్వరి పారా లీగల్ వాలంటర్ కల్పన పాల్గొన్నారు.

## 5వ శక్తిపీఠాన్ని అభివృద్ధి చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అవెన్యూవ్ ప్లాంటేషన్, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జడ్చర్ల నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో ఈ సూచికల ఏర్పాటుతో భక్తులకు స్పష్టమైన దిశానిర్దేశం కలుగుతుందన్నారు. ఆలయం వద్ద శుభ్రమైన వాతావరణం, బస్ స్టాండ్, సౌకర్యవంతమైన గదులు, శుద్ధమైన ఆహారం, పార్కింగ్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలంపూర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ మంచి సూచనగా భావిస్తున్నట్టు పేర్కొంటూ, ఆ పనులు వచ్చే రెండు మూడు నెలల్లో పూర్తి అయ్యే అవకాశముందని తెలిపారు. ఆలయ నిర్మాణ శైలిని దృష్టిలో ఉంచుకొని అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు కేటాయించడంలో ప్రభుత్వం ఎటువంటి వెనుకడుగు వేయదని, అవసరమైనంత మేరకు పూర్తిగా మద్దతు అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అలంపూర్ శాసన సభ్యులు విజయుడు అలంపూర్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తవ్వాలని, వచ్చే పుష్కరాల నాటికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి అని, భక్తుల సౌకర్యార్థం ప్రసాద్ పథకాన్ని త్వరలో ప్రారంభించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ, అలంపూర్ అభివృద్ధిపై ఇప్పటివరకు పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించామని, అన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆలంపూర్ జోగులాంబ దేవస్థానం, పాపినాశి, సంగమేశ్వర ఆలయాలలో క్షేత్రస్థాయి సందర్శనలు నిర్వహించామని తెలిపారు. ఈ నేపథ్యంలో కమిటీని ఏర్పాటు చేసి, సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పిపిటి ప్రజెంటేషన్ ద్వారా ఆలయ అభివృద్ధికి చేపట్టవలసిన వివరాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడప్ప, ఆర్డీవో అలివేలు, ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత కేంద్ర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

బి.రాంరెడ్డి తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడంతో పాటు పాఠశాలలను మామిడాకు తోరణాలతో అలంకరించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసుకోవాలని పాఠశాల ప్రధానో పాధ్యాయులకు ఆదేశాలను జారీ చేయడం జరిగిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు వారికి దగ్గరగా ఉండే పాఠశాలల్లో పిల్లలకు స్వాగతం పలకాలని విద్యాశాఖ సూచించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగినందున బడుల్లో సౌకర్యాలపై సర్కార్ దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు

(మొదటి పేజీ తరువాయి)

రుణమాఫీ, సన్నబియ్యం కు 500 రూపాయలు బోనస్, ఆడ బిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 200 లోపు యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. హైదరాబాదులో జూబ్లీహిల్స్ లో బంజారాహిల్స్ లో వనపర్తిలో ఉన్న శ్రీమంతులు తింటున్న సన్న బియ్యం మూడు కోట్ల పది లక్షల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్ ప్రసాద్, హౌసింగ్ డిఈ విటోభా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంకై పోరాటాలు చేద్దాం

**వనపర్తి, జూన్11 ప్రభాతవార్త :** ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉధృతంగా పోరాటాలు చేయాల్సిన అవసరముందని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవి ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణంలో బుధవారం ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానుద్దేశించి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి కాలయాపన చేస్తుందని వారు ఆరోపించారు. అనేక సమస్యలు నేటికి పరిష్కారానికి నదుచుకోవడం లేదని విమర్శించారు. ఐదు డిఏలు, పిఆర్సి పెండింగ్లో ఉన్నాయని, దాదాపు పది వేలకోట్లబకాయిలు ఈ కుబేరులో పేరుకు పోయాయని, సిపిఎస్ అంశం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమం తమ సంఘం భుజాన వేసుకొని ప్రజలలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి. వెంకటేష్, కే. జ్యోతి, కోశాధికారిటి. తిమ్మప్ప, జిల్లా కమిటీసభ్యులు బి.అరుణ, జి.మురళి, అయోధ్య రాముడు, అగ్రిప్ప, రియాజ్, చెన్నకేశవులు, పి.శ్రీనువాసులు, బాలీశ్వర్, అనసూయ, డి.రాము, మల్లేష్, ప్రవీణ్ ,కురుమన్న, చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

## లట్టుపల్లి మండల కేంద్రంగా ప్రకటించాలని తీర్మానం

**బిజినేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** లట్టుపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలోని రైతు వేదికలో అన్ని పార్టీల నాయకులు, కుల సంఘాలు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని అధికారులకు, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. తమ గ్రామాన్ని ఇప్పటికే గిరిజన ప్రాంతంగా ఉన్న 7 గ్రామాలను గ్రామపంచాయతీలుగా ప్రకటించారని తెలిపారు. అభివృద్ధివైపు అడుగులు వేసేందుకు అన్ని రకాల మౌలిక సదుపాయలతో ఉన్న తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తే ప్రభుత్వ స్థలాలతో పాటు గిరిజనగ ప్రాంతంగా ఉన్న మా ప్రాంతం అభివృద్ధివైపు అడుగులు వేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రగౌడ్, శ్రీనివాసరెడ్డి, చేతన్, ప్రేమ్‌లాల్, భూషయ్య, సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, ఇగురం బాధ వెంకటస్వామి, రాజేంద్ర గౌడ్, ఇగురం బాధ శ్రీనివాసులు, జియాజీ, పంతుల బాపూజీ, కేతావత్, రాజు పాల్గొన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

**నర్వ, జూన్ 11 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంతో పాటు రాయికోడ్, పాతర్‌చేడ్, ఉండేకోడ్, సీపూర్, లంకాల, రాంపూర్, యాంకి, పెద్ద కడుమూర్ తదితర గ్రామాల్లో రైతులు ఏరువాక పండగనుఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఎడ్లకు స్నానాలు చేయించి అలంకరణ జరిపారు. ఉల్లిగడ్డ, పచ్చిపసుపు తదితర వాటిని ఒకచోట కలిపిదంచి ఎడ్లకుతినిపించారు. రైతులు పొలాల్లో పూజలు నిర్వహించారు. గ్రామదేవతలకు, పశువులఘాటికి నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. వర్షాలు విస్తారంగా కురిసి పంటలు బాగా పండి అధిక దిగుబడి అందేలా వరాన్ని ప్రసాదించాలని రైతులు భగవంతుడిని వేడుకొన్నారు. సాయంత్రం కాగానే డప్పు చప్పుళ్ల నడుమ ఎడ్లబండ్లతో దేవాలయాల నుంచిప్రధానవీదుల గుండా బండ్లతో ర్యాలీ నిర్వహించారు. వర్షాలు బాగా కురిసిపంటలుబాగాపండాలనిఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**ఇటిక్యాల, జూన్ 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని షాబాద్ గ్రామానికి చెందిన మహేశ్వరి ( 25) సంవత్సరాలు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు మృతురాలు మహేశ్వరి కి పెళ్లి కాగా భర్త నుండి విడాకులు తీసుకొని తన తల్లి పద్మమ్మతో కలిసి షాబాద్‌లో ఉంటుందని తాను హైదరాబాద్ కు వెళ్లి గ్రూప్స్‌కు ప్రిపేర్ అయి చదువుకుంటానని ఈనెల 2వ తేదీన తనకు లక్ష రూపాయలు ఇవ్వాలని తల్లి పద్మమ్మను అడగగా రెండు రోజులు తర్వాత ఇస్తానని తల్లి చెప్పడంతో తల్లితో గొడవపడి మహేశ్వరి ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు సేవించగా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. కోలుకోలేక బుధవారం ఉదయం మృతి చెందినట్లు తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఇటిక్యాల ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.